
సాక్షి ఒడిశా

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,13,723లు, బంగారం 3గ్రాము 250 మిల్లీగ్రాములు, వెండి 113 గ్రాములు 150 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భయపెడుతున్న అతిసార

సుందరగడ్ జిల్లా రౌర్కెలా ప్రాంతంలో అతిసార వణికిస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటివరకు 6 మంది మృతి చెందినట్లు అధికారిక సమాచారం.

- 8లో



గంజాయి పంట ధ్వంసం

ఆర్.ఉదయగిరి బ్లాక్ కిరమా గ్రామ పంచాయతీలో సాగు చేస్తున్న గంజాయి పంటను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

రైలు ఢీకొని 7 ఆవులు మృత్యువాత



పట్టాలపై పడిన ఆవులు

బరంపురం: బీఎస్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి కొమ్మపల్లి జంక్షన్ రైల్వే క్రాసింగ్ వద్ద రైలు ఢీకొనడంతో 7 ఆవులు సోమవారం మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న బరంపురం రైల్వేస్టేషన్ జీఆర్పీ పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ బరంపురం రైల్వేస్టేషన్‌కు వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించారు.

ఇద్దరు నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఐఐసీ ఆచార్య

రాయగడ: ఒక దోపిడీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను జిల్లాలోని శశిఖాల్ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఐఐసీ ముని ఆచార్య కేసుకు సంబంధించిన వివరాలు సోమవారం వెల్లడించారు. ఈనెల 14వ తేదీన మునిగుడ నుంచి పార్వతీపురం బైకుపై వెళ్తున్న లిటిగుడ గ్రామానికి చెందిన ప్రహల్లాద డంగిరి (26) అనే యువకుడు, రాయగడ సమీపంలోని లద్ద గ్రామానికి చేరుకునేసరికి రాత్రి 2 గంటలయ్యింది. ఆ సమయంలో లద్ద వద్ద కాపుకాసిన ఐదుగురు దుండగులు బైకును ఆపి మరణాయుధాలతో బెదిరించి, ప్రహల్లాద వద్దనున్న రూ.6,540 నగదు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. దీంతో బాధితుడు శశిఖాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుల వివరాలు తెలియజేయలేదు.

'ఎన్నికలకు సమాయత్తమవ్వాలి'



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లేఖశ్రీ సమంత్‌సింగార్ సూచించారు. స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, యువమోర్చా అధ్యక్షులు, జిల్లా కమిటీ, కార్యవర్గ సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పార్టీ ఇన్‌చార్జి సరోజ్ సాబత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దేశ్వర మిశ్రా, జిల్లా ఉపాధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి, సాధారణ కార్యదర్శులు ఈ.ప్రశాంత్, జగన్నాథ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు చేపడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని 14వ వార్డు స్టేట్‌బ్యాంక్ రోడ్డు నుంచి ఆర్.కె.పాఢి రోడ్డు వరకు ఇదివరకు మూతబడిన డ్రైనేజీ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇటీవల ఈ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ఆందోళన చేయడంతో చర్యలు తీసుకుంటామని రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్ సామల్ హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా డ్రైనేజీలోని పీహెచ్‌ఈడీ పైపులను జేసీబీ ద్వారా బయటకు తీశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని బట్టగొడ వీధి, చాకలి వీధి ప్రజలు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ముగిసిన మాల్యవంత్ ఉత్సవాలు



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి జగన్నాథ సరక

మల్కన్‌గిరిలో జరుగుతున్న మాల్యవంత్ ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి జగన్నాథ సరక హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నేలకు చారిత్రాత్మకంగా ఎంతో వైభవం ఉందన్నారు. ఇక్కడ ఉత్సవాలు గత 20 ఏళ్లుగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ విశాల్ సింగ్, ఎస్పీ నితీష్ వాద్వానీ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి పురపాలక అధ్యక్షుడు మనోజ్ బారిక్, సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ ఖేముండు, బలిమెల పురపాలక అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పతితపవాన్ బేధ తదితరులు పాల్గొన్నారు.

– మల్కన్‌గిరి



శివ తాండవం ప్రదర్శన



మొహిని నృత్యం



మంత్రి సరకకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



పాట పాడుతున్న అర్చన పండ



వేదికపై పాటలతో అలరిస్తున్న సింగర్ అంతర చక్రవర్తి



పడగ నీడలో శివుడి నృత్య ప్రదర్శన



పూరీ మాల్కం ప్రదర్శన



గుజరాతీ నృత్యం



ఔమా మార్షల్ ఆర్ట్స్ బృందం ప్రదర్శన

జగన్నాథునికి శీతల వస్త్రధారణ

భువనేశ్వర్: శ్రీమందిరంలో ఏటా మార్గశిర శుక్ల షష్టి తిథి పురస్కరించుకుని శీతల షష్టి ఉత్సవం నిర్వహిస్తారు. శీతాకాలపు చలిని తట్టుకునేందుకు రత్న వేదికపై మూల విరాటులకు శీతల వస్త్రాలు ధరిస్తారు. ఈ అలంకరణను ఘొడొ లగ్గిగా పేర్కొంటారు. ఒఢొణి షష్టిగా ప్రతీతి. శ్రీజగన్నాథుని ద్వాదశ యాత్రల్లో ఇదొకటిగా ప్రసిద్ధి చెందింది. ప్రాతః ధూపం తర్వాత మైలమ్ ఉపచారంతో చతుర్ధామూర్తుల అలంకరణ చేస్తారు. ఈ సందర్భంగా దర్జీ సేవకులు సిద్ధం చేసిన గీత గోవింద్ పట్టు, నూలు వస్త్రాలతో శీతల వస్త్రాలు (ఉన్ని) మూల విరాటులకు ధరిస్తారు. మాఘ మాసం శుక్ల పంచమి వరకు నిరవధికంగా నెల రోజుల పాటు మూల విరాటులకు వస్త్రధారణ కొనసాగుతుంది. ఈ వ్యవధిలో ప్రతిరోజూ భగవంతుడు వివిధ రంగుల శీతల వస్త్రధారణతో శోభిల్లుతాడు. శ్రీ మందిరం సముదాయంలో కొలువుదీరిన విమలా దేవి, లక్ష్మీ, సరస్వతీ, మదనమోహన్ విగ్రహాలకు సైతం శీతల వస్త్రధారణ కొనసాగుతుంది. ఈ అలంకరణలో స్వామివారిని దర్శించుకోవడం పుణ్యప్రదంగా భక్తులు భావిస్తారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జయపురం: మున్సిపాలిటీ పరిధి 8వ వార్డు లేబర్ కాలనీ డెప్పిగూడ కూడలి వద్ద భువనేశ్వర్‌కు చెందిన నెట్రామ్ గుడ్ విజన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 76 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశామని తెలియజేశారు. అలాగే కళ్లద్దాలు అవసరమైన వారికి తక్కువ ధరలో సమకూర్చామని వెల్లడించారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3 లక్షల మందికి పరీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న చౌయితి ఉత్సవాలు



మాట్లాడుతున్న ఎస్డీపీవో సేనాపతి తదితరులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న చౌయితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో 35 నుంచి 60 ఏళ్ల మధ్య గల మహిళల కబడ్డీ పోటీలను సోమవారం నిర్వహించారు. స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) చైర్మన్ అనసూయా మాఝి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందని తెలియజేశారు. పోటీల్లో సంస్కృతి క్లబ్, రాయగడ అటానమస్, సాక్రేడ్ హార్ట్ స్కూల్, మున్సిపాలిటీ, అంగన్‌వాడీ జట్లు పాల్గొన్నాయి.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు

అనంతరం పురుషుల మధ్య జరిగిన వాలీబాల్ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి హాజరవ్వగా, గౌరవ అతిథులుగా జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, ఇంఫా పీఆర్వో శక్తి పాణిగ్రాహి తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



మహిళా క్రీడాకారులతో అనసూయ మాఝి



కబడ్డీ ఆడుతున్న మహిళలు

జనవరిలో రాష్ట్రానికి ఖర్గే రాక

భువనేశ్వర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. 2024లో జరగనున్న ఎన్నికల కోసం పార్టీ ప్రచారాన్ని ప్రారంభించడానికి విచ్చేయనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో రాష్ట్రంలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ ఎ.చెల్ల కుమార్ ఈమధ్య న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో 3 రోజుల పాటు న్యూఢిల్లీ పర్యటనలో పాల్గొన్నారు. దీంతో జనవరిలో రాష్ట్ర పర్యటనకు ఏఐసీసీ అధ్యక్షుడు తన సమ్మతిని తెలిపారని శరత్ పట్నాయక్ తెలిపారు. పార్టీ జాతీయ శాఖ అధ్యక్షుడి పర్యటన తేదీ, ఇతర వివరాలు త్వరలో ప్రకటిస్తారు. ఆయనతో పాటు పలువురు జాతీయ నాయకులు రాష్ట్ర పర్యటనకు విచ్చేసి జనవరి నెలలో బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. ఖర్గే భువనేశ్వర్, పశ్చిమ ఒడిశాలో నిర్వహించే ఊరేగింపు, బహిరంగ సభల్లో పాల్గొంటారని శరత్ పట్నాయక్ తెలిపారు.

తరుణ ప్రజ్ఞాభారతి సేవలు వెలకట్టలేనివి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: కళల పరిరక్షణలో జయపురం తరుణ ప్రజ్ఞాభారతి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక సంధ్యా ఫంక్షన్ హాల్‌లో తరుణ ప్రజ్ఞాభారతి 35వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు లక్ష్మీకాంత మిశ్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాహిణీపతి మాట్లాడుతూ.. సంస్థను నెలకొల్పిన దివంగత డాక్టర్ గంగాధర నందో హిందూ సాంప్రదాయాలు, సంస్కృతుల పరిరక్షణకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని కార్యక్రమాలు కొనసాగిస్తుండడం ప్రశంసనీయమన్నారు. సంస్థకు తన చేయూత ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, ఆదివాసీ సంస్కృతి పరిశోధకుడు పరేష్ రథ్, జయపురం బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి చంద్రకుమార్ నాయక్, హేమంత కుమార్ చాంద్, ప్రమోద్ రాశో తదితరులు పాల్గొన్నారు.

భయంకరి

- అర్ధరాత్రి అలజడి సృష్టించిన గజరాజులు



టమ్మనా పర్వతాల్లోకి వెళ్తున్న ఏనుగులు

గంజాం జిల్లా బంజనగర్ సబ్ డివిజన్ రేంజ్ ఉత్తర ఘుమసర అటవీ పరిధి కలియా అంబో పంచాయతీలోని జింకిపదా పర్వతాల్లో తులసీకోలా దగ్గర 18 ఏనుగుల గుంపు భీభత్సం సృష్టించాయి. తారసింగి అటవీ సమీపంలోని మాలన పదర, ముదిలి, గుడియాఅంబొ, పురణపని, జిలుండి, కలియాపల్లి గ్రామాల్లోకి ఆదివారం అర్ధరాత్రి చొరబడి సురేంద్ర నాయక్, కృష్ణ నాయక్ అనే ఇద్దరి రైతుల కల్లాల్లోని ప్రవేశించి మండీలకు తరలించేందుకు బస్తాల్లో ఉంచిన 10 ఎకరాల ధాన్యాన్ని నష్టపరిచాయి. అదేవిధంగా దగరలో ఉన్న ఉపేంద్ర నాయక్ పొలాల్లోకి చొరబడి ధాన్యం, కూరగాయలు, వేరుశనగ పంటని సైతం తినేసి నష్టపరిచాయి. ఏనుగుల గుంపు భీకరమైన శబ్దాలతో అలజడి సృష్టించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా బిక్కుబిక్కుమంటూ గడిపారు. సోమవారం ఉదయం సమాచారం అందుకున్న బరంపురం అటవీ రేంజ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో ఏనుగుల గుంపుని తిరిగి ఘుముసరా అడవిలోకి పంపించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఏనుగుల ద్వారా నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– బరంపురం



బంజనగర్ దగ్గర సంచరిస్తున్న గజరాజులు



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి చెట్లు



పలసపదర పొలాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు



చెల్లాచెదురైన ధాన్యం కుప్పలు



కొబ్బరి మొక్కలను ధ్వంసం చేసిన దృశ్యం

క్లుప్తంగా

నిరంతర సాధనతోనే నైపుణ్యాలు



పోలీసుల పరేడ్ సాధన పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: నిరంతర సాధనతోనే పోలీసుల్లో నైపుణ్యాలు మెరుగు పడతాయని జిల్లా అదనపు ఎస్పీ తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీసులు సోమవారం ప్రత్యేక పరేడ్ సాధన చేశారు. ఈ సాధన పరేడ్‌ను అయన పరిశీలించారు. పోలీసులు విధుల్లో రాణించాలంటే దేహదారుఢ్యం, ఆరోగ్యం రెండూ కీలకమని చెప్పారు. యూనిఫాం సక్రమంగా ధరించటం, క్రమశిక్షణతో విధులు నిర్వహించటం, రోజూ శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన



నాక్ బృందానికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం సోమవారం పర్యటించింది. మంగళవారం కూడా బృందం సభ్యులు కళాశాలను పరిశీలిస్తారు. ఉదయం కళాశాలకు వచ్చిన నాక్ బృందం సభ్యులు ప్రవీణ అక్తర్ పండిట్, కృష్ణశర్మ, కృష్ణంరాజులకు ప్రిన్సిపాల్ పి.లత స్వాగతం పలికారు. అనంతరం కళాశాల్లో పర్యటించి కళాశాలపనితీరును పరిశీలించారు.

విద్యార్థులకు ప్రత్యేక ప్రీమియం షోలు



ఎస్‌వీసీ థియేటర్ వద్ద విద్యార్థులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని మూడు థియేటర్లలో సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు సైన్స్ మీద అవగాహన కోసం ప్రత్యేక సందేశాత్మక ప్రీమియం షోలు వేశారు. జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు చిల్డ్రన్స్ ఫిల్మ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఎగిసే తారాజువ్వలు' అనే బాలల చలన చిత్రాన్ని ఎస్‌వీసీ సినీ మ్యాక్స్, సూర్యమహల్, కిన్నెర థియేటర్లలో ప్రదర్శించారు. బాలలకు ఇచ్చిన టికెట్ల వారీగా మూడు థియేటర్లు కలిపి 1280 మంది విద్యార్థులు హాజరయ్యారు. టికెట్ల ద్వారా వచ్చే సొమ్మును ఫిల్మ్ ఫెస్టివల్ ఆర్గనైజర్ యు.వి. సంతోష్ ద్వారా జిల్లా సాక్షర భారతి సమితి, పలు సేవాకార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల ర్యాలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని ఆ సంస్థ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సనపల నర్సింహులు కోరారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం స్థానిక ఎన్జీఓ హోమ్ నుంచి జెడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీలో స్పందన హాల్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, అగ్రి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ సింహ, రాష్ట్ర మహిళా కార్యదర్శి అరెలమ్మ, అసోసియేషన్ నాయకులు పీవీ రమణ, జె.గిరిబాబు, భాస్కర రావు, లక్ష్మీ నారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కూరగాయలతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ సాగు ఉత్పత్తుల విక్రయం

ఎల్.ఎన్.పేట, సారవకోట, కొత్తూరు, హిరమండలం: ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పిస్తూ ఊరూరా ఉత్పత్తుల విక్రయం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి సాగు విధానంలో పండించి ఉత్పత్తులను విక్రయించారు. హిరమండలం, కొత్తూరులోనూ ఈ విక్రయాలను జరిగాయి. ఆయా మండలాల అధికారులు అక్కడ పాల్గొన్నారు. హిరమండలంలో బ్లాక్ రైస్, రెడ్ రైస్‌లను కూడా ప్రదర్శించి విక్రయించారు. ఈ ఉత్పత్తులతో తయారు చేసిన బిస్కెట్లను కూడా అమ్మకాలు జరిపారు. కొత్తూరులో సేంద్రియ పద్ధతిలో కషాయాలు, ద్రావణాలు తయారు చేయడంపై అవగాహన కల్పించారు.

భయపెడుతున్న అతిసార



రౌర్కెలా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార పీడితులు

- రౌర్కెలాలో పెరుగుతున్న రోగులు
- ఇప్పటివరకు ఆరుగురు మృతి
- నీటి కాలుష్యమే కారణం: ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్

భువనేశ్వర్: సుందరగడ్ జిల్లా రౌర్కెలా ప్రాంతంలో అతిసార వణికిస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటివరకు 6 మంది మృతి చెందినట్లు అధికారిక సమాచారం కాగా, 8 మంది మృతి చెందినట్లు అనధికారిక వర్గాల భోగట్టా. సోమవారం ఒక రోగి మృతి చెందడంతో ఉక్కు నగరం రౌర్కెలాలో అతిసార మృతుల సంఖ్య ఆరుకు చేరిందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన మిశ్రా తెలిపారు. లోగడ నగరంలో వివిధ వార్డులకు చెందిన 5 మంది ఈ అతిసార తాకిడితో మృత్యువాత పడ్డారు.

మరో 20 మంది పరిస్థితి విషమం

ప్రస్తుతం రౌర్కెలా, పరిసర ప్రాంతాల్లోని వివిధ ఆస్పత్రుల్లో 555 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో 20 మంది పరిస్థితి విషమంగా ఉందని నిరంజన్ మిశ్రా సోమవారం తెలిపారు. 163 మంది రోగులు రౌర్కెలా జనరల్ ఆస్పత్రి, ఇస్పాత్ జనరల్ ఆస్పత్రిలో చేరారు. ఐసీయూలో చికిత్స అవసరమైన తీవ్రమైన రోగులను హైటెక్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. వారిలో 145 మంది కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. మరో 26 మంది వైద్య సలహాకు విరుద్ధంగా ఆస్పత్రి నుంచి ఇళ్లకు వెళ్లినట్లు తెలుస్తోంది. భువనేశ్వర్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం రౌర్కెలా మరియు పరిసర ప్రాంతాల్లో పర్యటించి అపరిశుభ్రమైన నీరే వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణమని కనుగొన్నారు. రౌర్కెల స్మార్ట్ సిటీలో వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్న నీటిలో క్లోరిన్ స్థాయిని పెంచాలని వాట్కో వర్గాలకు ఆదేశించినట్లు వివరించారు.

ప్రజలకు అవగాహన

అదనంగా కొత్త రోగులను గుర్తించడం, రోగులకు ప్రాథమిక మందులు అందించడం, డయేరియాకు సంబంధించి అవగాహన కల్పించడం కోసం 6 సంచాలక వైద్య యూనిట్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పెరుగుతున్న రోగుల సంఖ్యకు చికిత్స చేయడానికి వివిధ ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను పెంచారు. సుందర్‌గడ్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి (ఎస్‌జీఎంసీహెచ్) నుంచి వైద్య బృందం ఎపిడెమియోలాజికల్ కోణం నుంచి పరిశీలన ప్రారంభించింది. ప్రత్యేకంగా 4 మంది జూనియర్ డాక్టర్లు, 12 మంది స్టాఫ్ నర్సులు, ఒక మైక్రో బయాలజిస్ట్, 2 మంది లేబొరేటరీ టెక్నీషియన్లను నియమించినట్లు సుందరగడ్ జిల్లా ప్రధాన వైద్య అధికారి సీడీఎంవో తెలిపారు.

పెరుగుతున్న బాధితులు

ఈనెల 11వ తేదీ నుంచి నగరంలోని పలు ఆస్పత్రులకు అతిసార పీడితులు రావడం ప్రారంభమైంది. కొద్ది రోజులుగా వారి సంఖ్య పెరుగుతూనే ఉండడంతో కలవరపడుతున్నారు. చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు శుక్రవారం మరణించారు. మరొకరు శనివారం ఉదయం మరణించారు. మృతుల్లో నగరంలోని పాన్‌పోష్, ఉదిత్ నగర్‌కు చెందిన జి.సమంత (38), పుల్తోలి గౌడ్ (23), అహల్య నాయక్ (70), మానషి దూబే (75)లు ఉన్నట్లు గుర్తించారు. రౌర్కెలా రైల్వేస్టేషన్ సమీపంలోని హోటల్ యజమాని ప్రణబ్ కిషోర్ స్వాయిక్ (50) శనివారం రాత్రి హైటెక్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (హెచ్‌టీఎంసీహెచ్)లో మరణించాడు. అలాగే రౌర్కెలా ప్లాంట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అస్లాం, రౌర్కెలా గాంధీ రోడ్డుకు చెందిన అతుల్ కిసాన్‌లు మరణించారు.

సమీక్ష

నగరంలో అతిసార వ్యాప్తిపై సర్వత్రా ఆందోళన పెరుగుతోంది. రౌర్కెలా ఎమ్మెల్యే శారదా ప్రసాద్ నాయక్, సుందరగడ్ లోక్‌సభ సభ్యుడు జుయెల్ ఓరమ్, సుందరగడ్ కలెక్టర్ హర్షద్ పరాగ్ నగరంలోని వివిధ ఆస్పత్రులను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

పర్లాకిమిడి: సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకొని స్థానిక జంగంవీధి రైల్వేగేటు వద్దనున్న బాల సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి సోమవారం ఉదయం భక్తులు పోటెత్తారు. స్వామివారికి హోమాదులు, ప్రత్యేక పూజలు వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పొరుగున ఉన్న పాతపట్నం మండలం రుగడ, బైదలాపురం, ఏఎస్ కవిటి, అనంతగిరి గ్రామాల నుంచి సైతం భక్తులు విచ్చేశారు. కమిటీ సభ్యులు మందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుర్గా పట్నాయక్ మృతికి సంతాపం



దుర్గా పట్నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

జయపురం: బొరిగుమ్మ సమితి అధికార బీజేడీ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర నేత దుర్గా పట్నాయక్ అకాల మృతికి జయపురం బీజేడీ నాయకులు సంతాపం ప్రకటించారు. స్థానిక పంచానన మందిర ప్రాంగణంలో దుర్గా పట్నాయక్ సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రర యువ బీజేడీ కార్యదర్శి దేవేంద్ర అధికారి, కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దుర్గా మిశ్ర, కార్మిక నేత, సీనియర్ బీజేడీ నేత బాలా రాయ్ పాల్గొన్నారు.

పక్కాగా పది విద్యార్థుల డేటా

శ్రీకాకుళం న్యూకాలనీ:

పదో తరగతి విద్యార్థుల డేటా తయారీని పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపుల పర్వం దాదాపుగా పూర్తయ్యింది. పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సైతం ప్రభుత్వం వెల్లడించింది. 2024 మార్చి 18 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలో ఇప్పటి వరకు 29292 మంది ఫీజులు చెల్లించారు. జిల్లాలో 589 ఉన్నత పాఠశాలల్లో 27660 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా పదో తరగతి చదువుతుడగా, ప్రైవేటు(గతంలో ఫెయిలైనవారు)గా మరో 1632 మంది పరీక్ష ఫీజులు చెల్లించారు.

తప్పులకు మూల్యం తప్పదు..

మార్చి 18వ తేదీ నుంచి మొదలుకానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల డేటాతో పాటు వారి వ్యక్తిగత సమాచారం పక్కగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే భవిష్యత్‌లో విద్యార్థుల మార్క్స్ మెమోలో తలెత్తే తప్పులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే బాధ్యులని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని పాఠశాల విద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

నామినల్స్ సవరణకు ఛాన్స్..

ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ సవరణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో విద్యార్థుల వ్యక్తిగత సమాచారం ముఖ్యంగా విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, విద్యార్థి జన్మదినం, మీడియం, విద్యార్థి ఫొటో, సంతకం, ఆధార్‌కార్డు నంబర్, పుట్టుమచ్చలు, మొదటి, ద్వితీయ భాష, విద్యార్థి వైకల్యం, ఓఎస్ఎస్‌సీ సబ్జెక్ట్/కోడ్, తదితర సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశించారు. దీంతో ఒకవేళ పొరపాటున కంప్యూటర్‌లో డేటా నమోదు సమయంలో దోషాలు జరిగితే తప్పుల సవరణకు ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో 'ఎడిట్' ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే పీహెచ్‌సీ విద్యార్థుల సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసిసిన కాపీని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌లో ఒరిజినల్, జిరాక్స్ కాపీలను ఈనెల 25వ తేదీలోగా తీసుకువచ్చి ధృవీకరించుకుని వెళ్లాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై డీఈఓ కె.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఒకటికి రెండు సార్లు సరి చూసుకుని డేటా నమోదు చేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు అన్యాయం చేయకూడదనే ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిందని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ తెలిపారు.



పరీక్షలకు సన్నద్ధమౌతున్న పదో తరగతి విద్యార్థులు

ఆడవరం బడిలో శతక పద్యార్చన

గార : మండలంలోని ఆడవరం ప్రాథమిక పాఠశాలలో శాంతి సద్భావన యాత్రలో భాగంగా శతక పద్యాల సామూహిక పద్యార్చన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో అమ్మ, నాన్న.. గురువుపై ఈ పద్యార్చన జరిగింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ వందేమాతరం పేరుతో వంద దేశాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆడవరంలో జరిగిందని, తెలుగులో పదిలక్షల మందితో ఒకే సారి చదివించడం గొప్ప విషయమని కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణారావు అన్నారు.

టీవీ రిపేరు దుకాణంలో అగ్ని ప్రమాదం



కోటబొమ్మాళిలో అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న దుకాణం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని అయ్యప్ప గుడి వీధిలో ఉన్న టీవీ రిపేరు దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరగగా రూ.లక్షన్న ర వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ఇంటి యజమాని గవర్రాజు తెలిపిన సమాచారం.. గవ ర్రాజు కుటుంబసభ్యులతో కలిపి దైవదర్శనం కోస మని ఇంటికి, షాపునకు తాళాలు వేసి శివాలయాని కి వెళ్లారు. దర్శనం అనంతరం ఇంటికి వెళ్లే సరికి ఇంటిముందు ఉన్న దుకాణంలోనుంచి పొగ బయటకు వస్తోంది. స్థానికులు కోటబొమ్మాళి అగ్నిమాప క కేంద్రానికి సమాచారం అందజేశారు. దీంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ లోగా విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు విద్యుత్ సరఫరాను నిలిపివేవారు. లేదంటే పెద్ద ప్రమాదమే జరి గి ఉండేది. షాపును తెరిచి చూడగా ఎలక్ట్రానిక్ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. కోటబొమ్మాళి డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్‌ఓ పేడాల అఖిల్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం యువ ఒడిశా – నవీన్ ఒడిశా నినాదంతో క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి అన్నారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల వార్షిక క్రీడోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకురాలు రాజ్యలక్ష్మీ పండా మాట్లాడుతూ నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు వార్షిక క్రీడా పోటీల్లో మొత్తం 940 విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేశారు. విద్యార్థులంతా ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. విజేతలకు మున్సిపల్ చైర్ పర్సన్ నిర్మలా శెఠి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో నువా ఒడిశా నోడల్ అధికారి ఆర్.కె.భుయ్యాన్, ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్, ఒడిస్సీ నృత్య కళాకారిణి డి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి

గంజాయి పంట ధ్వంసం



మొక్కలను తగలబెడుతున్న ఎక్సైజ్ సిబ్బంది



గంజాయి మొక్కలను ధ్వంసం దృశ్యం

పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరి బ్లాక్ కిరమా గ్రామ పంచాయతీ మాణిక్‌పూర్, జమ్ముగుడ అటవీ ప్రాంతంలో 29,400 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ప్రదోష్ కుమార్ సెఠి సోమవారం తెలియజేశారు. మొత్తం 58,800 గంజాయి మొక్కలను నాశనం చేసినట్లు వెల్లడించారు. కాపుకొచ్చిన గంజాయి క్షేత్రాలపై దాడులు కొనసాగిస్తామన్నారు. అక్రమంగా సాగు, రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అఖిల భారతీయ అధివక్త పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న మదన మోహన్ నాయక్

జయపురం: స్థానిక యాదవ భవనంలో అఖిల భారతీయ అధివక్త పరిషత్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మదన మోహన్ నాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల హక్కులు, బాధ్యతలపై మాట్లాడారు. రాజ్యాంగం అంబేడ్కర్ మనకు ఇచ్చిన గొప్ప వరమని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. అనంతరం కొరాపుట్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా భారతీయ అధివక్త పరిషత్ అధ్యక్షుడిగా మీన కేతన పరిచ, ఉపాధ్యక్షుడిగా సుదర్శన మరిఖ, కార్యదర్శిగా సందీప సాయి పాణిగ్రహి, సహాయ కార్యదర్శిగా రాజేంద్ర కుమార్ గౌఢ, కోశాధికారిగా నీరజ కుమార్ నాయక్, న్యాయ సలహాదారుడిగా గిరిధారి ఖొరలను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నృపేంద్ర దాస్, గౌరవ అతిథిగా జయపురం అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.

'కుమారుని తీరుతో వేదన చెందుతున్నా'



మాట్లాడుతున్న వరదా కొండబాబు

శ్రీకాకుళం క్రైమ్ : కుమారుని తీరుతో తీవ్రంగా వేదన చెందుతున్నానని, వయోవృద్ధుల సంక్షేమం, బాధ్యత చట్టాన్ని సక్రమంగా అమలయ్యేటట్లు అధికారులు చూడాలని శ్రీకాకుళంలోని నాగావళి హోటల్ యజమాని, మేనేజింగ్ డైరెక్టర్ వరదా కొండబాబు కోరారు. అయన సోమవారం నగరంలోని రోటరీక్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను కని వారు వృద్ధిలోకి వస్తే ఆనందిస్తారని, వృద్ధాప్యంలోకి వచ్చాక ఆదరిస్తారనే నమ్మకంతో ఉంటారని, కానీ తనకు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కష్టార్జితంతో నిర్మించిన నాగావళి హోటల్‌ను కుమారుడు ఆనంద్ సొంతం చేసుకుని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడని, ఆదాయ మార్గంగా ఉండే హోటల్ నిర్వహణకు తనను అనుమతించకపోవడంతో 87 ఏళ్ల వయసులో నాలుగు నెలలుగా బయట గడపాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. తనతో పాటు ఇద్దరు కుమార్తెలకు, కుమారుడికి నాలుగు సమభాగాలుగా రాసినా మూడు సమభాగాలు (కొండబాబు తదనంతరం) తనకే ఇవ్వాలని మనవడితో కలిసి గొడవపడుతూ తీవ్ర మనోక్షోభకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. భార్య సరోజ చనిపోవడంతో కుమార్తెలు ఆదరిస్తున్నారనే కోపంతో వారితోనూ గొడవ పడ్డాడని, వందేళ్ల నాటి ఆస్తుల డాక్యుమెంట్లు, కంపెనీ రికార్డులు, హోటల్ పత్రాలు దొంగిలించడమే కాక తన వ్యక్తిగత సహాయకుడిని కూడా కొట్టారని తెలిపారు. దీనిపై రెండో పట్టణ స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే కుటుంబ సమస్య, సివిల్ మ్యాటర్ మీరే తేల్చుకోవాలని సూచించారని, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు కూడా గత సెప్టెంబర్‌లో విన్నవించానని తెలిపారు. తనపై జరిగిన దౌర్జన్యం వీడియో ఫుటేజీని మీడియాకు అందించారు.

కోర్టు పరిధిలో ఉంది..

వరదా కొండబాబు ఆరోపణలపై ఆయన కుమారుడు వరదా ఆనంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. అది లీగల్ కేసు అని, ఇంకా కోర్టు పరిధిలోనే కేసు ఉందని తెలిపారు. తమ మధ్య ఎలాంటి తగాదాలు లేవని చెప్పారు. అనారోగ్యం కారణంగానే తన తండ్రి అలా మాట్లాడుతున్నారని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్నందున అంతకుమించి మాట్లాడలేనని తెలిపారు.

సౌత్‌వెస్ట్ టోర్నమెంట్‌కు నీలిమ

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న డి.నీలిమ సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ (మహిళలు) టోర్నమెంట్‌కు ఎంపికైంది. చిన్నకాకానిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపడంతో ఆమెను ఎంపిక చేశారని శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వెంకటాచలం సోమవారం తెలిపారు. ఈ మేరకు నీలిమను అభినందించారు. ఈనెల 23 నుంచి 26వ తేదీల మధ్య ఎంజీఎం యూనివర్సిటీ ఔరంగాబాద్‌లో జరిగే పోటీల్లో నీలిమ పాల్గొంటుంది. అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కోటేశ్వరరావు, స్పోర్ట్స్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ జయరాజ్, స్పోర్ట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నర్సింహమూర్తి, పీడీ డాక్టర్ బి.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రాన్ని అందించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక బృందం

ప్రయాణికులకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతుల ప్రదానం

శ్రీకాకుళం క్రైమ్: ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్ స్కీమ్‌లో ఎంపికైన ప్రయాణికులకు సోమవారం శ్రీకాకుళం 1, 2, డిపోల మేనేజర్లు మల్లికార్జున రాజు, కె.ఆర్.ఎస్.శర్మలు బహుమతులు అందజేశారు.

డిసెంబరు 1 నుంచి డిసెంబరు 16 వరకు రెండు డిపోలకు చెంది న ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఆమదాలవల స, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జీకేవలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన వారికి డ్రా తీయగా.. సాలూరు మార్గంలో ప్రయాణించిన వేణుగోపాల్ మధుసూదనరావు, చీపురుపల్లి మార్గంలో నారాయణరావు, బందరువానిపేట మార్గంలో డి.భువనేశ్వర్, జి.కె.వలసకు రామన్న, అశోక్, శ్రీముఖలింగంకు ఎం.వెంకటరమణ, గణేష్‌బాబు, జి.శంకర్ లు ఎంపికయ్యారు. విజేతలకు జీఎన్‌వీ జ్యూయలర్స్ యాజమాన్యం దామోదరరావు, బోయిన పృథ్వీ, ఊన్న కిరణ్‌కుమార్‌లు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్లు రమేష్, శంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, స్టేషన్ మేనేజర్ ఎం.పి.రావు, ఎస్‌డీఐ మూర్తి, పీఆర్వో సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐక్య క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం



ఐక్య క్రిస్మస్ వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ సీఎస్ఐ చర్చి గ్రౌండ్స్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించే విజయనగరం జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు డాక్టర్ విజయకుమార్ శర్మ, డాక్టర్ పి.ప్రేమానందం, రెవరెండ్ ఎస్.మధు, డాక్టర్ బి.ఉదయ్ చంద్ర, బిషప్ ఎం.పాల్సన్, డి.ఎలీషాలు పిలుపునిచ్చారు. ఈ మేరకు చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జుహాని హాలోనన్ ముఖ్య వర్తమానికులుగా హాజరుకానున్నారన్నారు. ఆయనతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, పాస్టర్స్, మిషనరీలు, ఫెలోషిప్ ప్రతినిధులు హాజరై దివ్యసందేశాన్ని అందజేయనున్నారని వివరించారు. క్రైస్తవ సోదరులందరూ క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



కురుపాం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న కూరంగి నరేష్

కురుపాం: ప్రేమించిన అమ్మాయి తనను కాదని ఇంకో వ్యక్తితో పెళ్లికి సిద్ధమైందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన కూరంగి నరేష్ (30) ఆరేళ్లుగా తాను ప్రేమించిన యువతి వేరే వ్యక్తితో పెళ్లికి సిద్ధం కావడంతో సోమవారం ఉదయం ఎడమ చేతి మణికట్టుపై బ్లేడుతో కోసుకుని, రుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన స్థానిక యువకులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా క్షణాల్లో చేరుకున్న వాహనం అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం బస్తాలకు నిప్పు



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై జనార్దనరావు

వంగర: మండల పరిధి అరసాడలో బెవర వెంకటరావుకు చెందిన ధాన్యం బస్తాలకు ఆదివారం రాత్రి దుండగులు నిప్పుపెట్టినట్లు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన బెవర వెంకటరావు వ్యాపారి కావడంతో రైస్‌మిల్లుకు తరలించేందుకు ధాన్యంబ బస్తాలు సిద్ధం చేసి అదే గ్రామానికి చెందిన లచ్చుభుక్త కృష్ణమూర్తి కళ్లం వద్ద భద్రపరిచాడు. ఆ బస్తాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని, ఆ ప్రదేశంలో చెప్పులు, పెట్రోల్ ఉపయోగించిన బాటిల్ గుర్తించామని వెల్లడించారు. సంఘటనాస్థలాన్ని సీఐతోపాటు ఎస్సై ఆర్.జనార్దనరావులు పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కరాటేలో రాజాం విద్యార్థుల ప్రతిభ

రాజాం సిటీ: కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలో రాజాం పట్టణానికి చెందిన కరాటే విద్యార్థులు ప్రతిభకనబర్చి బంగారు పతకాలు సాధించారని మాస్టర్ ఆర్.శివ సోమవారం తెలిపారు. ఈ నెల 17న శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాజాంకు చెందిన ఆర్.చిన్న, ఎస్.లితీష్‌లు బంగారు పతకాలు సాధించగా ఎం.మణికంఠ మూడో స్థానం కైవసం చేసుకున్నాడన్నారు. వారి ప్రతిభపట్ల పలువురు అభినందించారు.

మృతుడి వివరాలు తెలిస్తే చెప్పాలి

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస కూడలి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే తమకు తెలియజేయాలని పెదమానాపురం ఇన్‌చార్జ్ ఎస్సై శిరీష సోమవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలుంటాయని సీసీ కెమెరాలో ఉన్న ఫొటో ద్వారా గుర్తించామన్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, చిరునామా తెలిసిన వారు ఎస్సై పెదమానాపురం ఫోన్ 91211 09431, 9121109461 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈ ఏడాది అక్టోబర్ 26నుంచి డిసెంబర్ 18 వరకు హుండీల ద్వారా రూ.5,99,427లు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ మరళీకృష్ణ తెలిపారు. లెక్కింపు ప్రక్రియను దేవాలయాల కార్యనిర్వహణాధికారి సర్వేశ్వరరావు పర్యవేక్షించారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కోర్టును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల వీరభద్రస్వామి

- మహిళాపార్కులో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో నిర్వహణ
- హాజరుకానున్న 9 జట్లు
- విజేతలకు రూ.1.40 లక్షల బహుమతులు

విజయనగరం: మహిళా క్రీడాకారిణులు, మహిళా అంపైర్‌లు, మహిళా అతిథులు, చివరికి మహిళా ప్రేక్షకుల నడుమ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీలకు విజయనగరం వేదిక కానుంది. తన ప్రభుత్వ హయాంలో మహిళలకు చేసిన ప్రయోజనాలకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనరగం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో కార్పొరేషన్ మహిళా విభాగ కమిటీ సారథ్యంలో మూడు రోజుల క్రీడా సంబరానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పార్కులో ఈనెల 19, 20, 21 తేదీల్లో ఈ పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా పోటీల ప్రారంభం, ముగింపు కార్యక్రమాలకు మహిళా అధికారిణులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హాజరుకానున్న ఇతర జిల్లాల జట్లు

రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 జట్లు హాజరుకానున్నాయి. పోటీల్లో అతిథ్య విజయనగరం జట్టుతో పాటు శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి, గుంటూరు, అనంతపురం, కృష్ణా, చిత్తూరు, విజయవాడ అకాడమీ జట్లు తలపడనున్నాయి. విద్యుత్ కాంతుల్లో ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ఈ పోటీలు ఈనెల 21వ తేదీన ముగియనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి హాజరవుతున్న క్రీడాకారిణులకు భోజన, వసతి సదుపాయాలను రాజీవ్ స్టేడియంతో పాటు డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు.

విజేతలకు బహుమతులు

రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో విజేతలకు భారీ మొత్తంలో నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నారు. పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ.40వేలు, తృతీయ, నాల్గవస్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.30వేలు, 20వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేయనున్నారు.

విజయవంతమయ్యేందుకు కార్యాచరణ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలను అందరి సహకారంతో విజయవంతం చేసేలా కార్యాచరణ రూపొందించాం. నగరంలోని మహిళా పార్కులో మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తాం. పూర్తిగా మహిళల సారథ్యంలో ఈ పోటీలు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

– కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, విజయనగరం

బాక్సింగ్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన క్రీడాకారులు రెండు స్వర్ణ, 3 రజత, ఐదు కాంస్య పతకాలను సాధించడం ఎంతో ఆనందంగా ఉందంటూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. విజేతలైన క్రీడాకారులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రత్యేకంగా ఆయన అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో కూడా పతకాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బాక్సింగ్ చీఫ్ కోచ్ సీతారాం మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో 10 పతకాలను నగర క్రీడాకారులు సొంతం చేసుకున్నారన్నారు. అండర్ 14,17,19 బాలబాలికలకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో బి.బాలకుమార్, శశాంక్ నాయుడు స్వర్ణ పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ రీజనల్ మీట్ ప్రారంభం



మార్చ్‌పాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం అర్బన్: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్ విజయనగరం పట్టణంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడామైదానంలో సోమవారం ప్రారంభమైంది. తొలుత క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని 5 ప్రభుత్వ, 17 ప్రైవేట్ కళాశాలల జట్లు ఈ మీట్‌లో పాల్గొంటున్నాయి. ఈ పోటీలలో 300 బాలురు, 156 మంది బాలికలు తమ క్రీడా ప్రతిభను నిరూపించుకోనున్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ క్రీడోత్సవాలలో బాలుర కోసం 16 క్రీడలు, బాలికల కోసం 15 క్రీడాంశాలపై పోటీలు జరగనున్నాయి. తొలిరోజు క్రీడాపోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.అచ్యుతకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా ప్రముఖ క్రీడాకారిణ గుణ ప్రవల్లిక ఉప్పల హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆశామణి, కాకినాడ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

26నుంచి ఆడుదాం ఆంధ్రా



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతాయని ప్రభుత్వ అదనపు కార్యదర్శి ముత్యాలరాజు సోమవారం కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు. డిసెంబర్ 26నుంచి ఫిబ్రవరి 10వ తేదీవరకు క్రీడలు జరుగుతాయని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో రేణుక ప్రతిభ



ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన రేణుకను అభినందిస్తున్న కరెస్పాండెంట్, సిబ్బంది

చీపురుపల్లి: ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో చీపురుపల్లి పట్టణంలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని పతివాడ రేణుక ఉత్తమ ప్రతిభ కనపరచింది. ఈ నెల 12 నుంచి ఆంధ్రాయూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న ఆమె ఐదు కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, పది కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో రేణుకను కళాశాల కరెస్పాండెంట్ ఎం.ఆదినారాయణ, అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రేణుకను మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రామునాయుడు ఉన్నారు.

ఎంపీపీకి ఛేంజ్ మేకర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు

బొబ్బిలి: మహిళా సాధికారత, బాలికాభివృద్ధిలో అడుగులు వేస్తూ అభివృద్ధి పథాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న మహిళలకిచ్చే ఛేంజ్ మేకర్ అవార్డును బొబ్బిలి ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు అందుకున్నారు. స్త్రీవన్ ఇండియా ఆధ్వర్యంలో మహిళల ఆర్థిక, సామాజిక శక్తులను గుర్తించే స్త్రీ వన్ ఇండియా ద్వారా ఎంపీపీ లక్ష్మీ వేణుగోపాలనాయుడికి ఈ అవార్డును విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం రాత్రి స్త్రీ వన్ ఇండియా ప్రతినిధి మేరీ స్టెల్లా మైకేల్ ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కేంద్ర మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకురాలు కిల్లి కృపారాణి హాజరయ్యారు.

ఆర్టీసీ ప్రయాణికులకు లాటరీలో గిఫ్ట్‌లు



లాటరీ విజేతకు బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

విజయనగరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులకు లాటరీలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు స్థానిక డిపో ప్రాంగణంలో సోమవారం జరిగిన గిఫ్ట్‌ల ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రూట్లలోని బస్సుల్లో ప్రయాణం చేసే వారి టిక్కెట్ల నుంచి లాటరీ తీసి బహుమతులను అందజేస్తామని తెలియజేశారు. నెలలో రెండుసార్లు ఈ లాటరీ పద్ధతిలో టిక్కెట్లను తీసి ముందుగా ప్రకటించిన ప్రతి రూటుకు మూడు బహుమతులు ఇస్తామని వివరించారు. డిసెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ రూట్లలో తిరిగే బస్సుల ప్రయాణికుల లాటరీ ద్వారా ఇటీవల ప్రకటించిన బహుమతులను విజేతలకు అందజేశారు. విజేతల వివరాలిలా ఉన్నాయి. సింహాచలం రూట్‌లో హేమ, అప్పారావు, ఆంధ్ర రూట్‌లో ఎం.గణేష్, కల్యాణి, ఎస్‌కోట వయా జామి రూట్‌లో కొండమ్మ, మూర్తి, చీపురుపల్లి రూట్‌లో మాధురి, నాగమణిలకు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ, ఎస్టీఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 205 వినతులు



వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న జేసీ

విజయనగరం అర్బన్: విజయనగరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి 205 వినతులను సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ స్వీకరించారు. విజయనగరం ఆర్డీఓ సూర్యకళ డిప్యూటీ కలెక్టర్లు డి.వెంకేశ్వరరావు, బి.సుదర్శన దొర, రాజేశ్వరి, సుమబాల, సుధారాణి తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు వాటిని పరిష్కారం కోసం పంపించారు. వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 134 వినతులు వచ్చాయి. వినతులను అర్జీదారుల సంతృప్తి మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను జేసీ ఆదేశించారు.

ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలి

స్పందన అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు మొదలైందని, ప్రత్యేకాధికారులు రైతు భరోసా కేంద్రాలను సందర్శించి అన్ని చోట్ల ప్రారంభించింది లేనిదీ తనిఖీలు చేయాలని సూచించారు. గన్నీ బ్యాగ్స్ ఉన్నదీ? లేనిదీ? కొనుగోలులో ఏవైనా సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి గానీ లేదా డీఎస్ఓ దృష్టికి గానీ తీసుకురావాలని స్పష్టం చేశారు. వర్షాల వల్ల కొంత ఆలస్యంగా ధాన్యం కొనుగోలు మొదలైందని వేగంగా, సక్రమంగా జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు.

వినతులను సకాలంలో పరిష్కరించాలి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు, కెఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడులు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజలనుంచి వచ్చిన వినతుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో జేసీ మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 200 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మండలం చలమవలస గ్రామానికి చెందిన సంబాన స్వామినాయుడుకు రూ.3,500లు విలువ చేసే వినికిడి యంత్రాన్ని జాయింట్ కలెక్టరు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, ఎ.డి సర్వే కె.రాజకుమార్, జిల్లా ప్రణాళికా అధికారి పి.వీరరాజు, జిల్లా విపత్తు స్పందన అధికారి కె.శ్రీనివాస బాబు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పోలీస్ అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన 34 ఫిర్యాదులను ఆమె స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వల విసిరితే చేప పడాల్సిందే..!

- సాంకేతికతను అందిపుచ్చుకోబోతున్న మత్స్యకారులు
- త్వరలోనే జీపీఎస్, ఎకోసౌండ్ సిస్టం వినియోగం



బర్రిపేట రేవులో ఒడ్డున నిలిపిన బోట్లు

పూసపాటిరేగ:

సంద్రమే జీవనాధారంగా బతుకు యానం సాగిస్తున్న మత్స్యకారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. భారీ వలలతో సాగర మథనం చేసినా ఒక్కోసారి చేపలు చిక్కక ఉసూరుమంటూ వెనుదిరిగే పరిస్థితి నుంచి బయటపడుతున్నారు. కెమెరాలు, జీపీఎస్, ఎకోసిస్టం వినియోగించి సముద్ర గర్భంలో మత్స్యసంపదను ఒడిసి పడతారు. విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 574 ఇంజిన్ బోట్లు, 254 సంప్రదాయ బోట్లలో 3,908 మంది మత్స్యకారులు వేటను సాగిస్తున్నారు. వారిపై పరోక్షంగా 16 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. పెద్ద ఇంజిన్‌బోట్లు, చిన్న ఇంజిన్‌బోట్లలో జీపీఎస్, ఎకోసౌండ్ సిస్టం, ఫిష్‌ఫైండర్ ఉపయోగించి చేపల వేట సాగించవచ్చు. బోటు కిందవైపు కెమెరాలు అమర్చి బోటు లోపల కెమెరాతో అనుసంధానం చేసి చిన్న స్క్రీన్‌తో కూడిన కంప్యూటర్ లాంటి పరికరం అమర్చాలి. ఆ బోటు సముద్రంలో లోపలికి వెళ్లాక ఎకోసౌండ్ ఫిష్ ఫైండర్‌ను ఆన్ చేయాలి. సముద్రంలోతు, చేపల చలనం తదితరాలు ఫిష్‌ఫైండర్‌లో కనిపిస్తాయి. చేపలు గుంపుగా వచ్చినప్పుడు శబ్దతరంగాలు విడుదలవుతాయి. దీంతో చేపలు రివర్స్‌లో రావడంతో వల విసరగానే సులభంగా చిక్కుతాయి.

త్వరలోనే పరికరాలు సిద్ధం



ఎకోసౌండ్, ఫిష్‌ఫైండర్, జీపీఎస్ పరికరాలకు టెండర్ అవుతోంది. ఇప్పటికే విశాఖ, కాకినాడ జిల్లాల్లో టెండరింగ్ పూర్తయి పరికరాలు మంజూరయ్యాయి. త్వరలోనే విజయనగరం జిల్లాకు పరికరాలు మంజూరవుతాయి. జీపీఎస్, ఎకోసౌండ్ ఫిష్ ఫైండర్ ద్వారా చేపలు పట్టే విధానం సులువుగా ఉంటుంది. తమిళనాడు, గుజరాత్‌లో ఎక్కువమంది మత్స్యకారులు సాంకేతికతను ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల వేటకు సహకారం అందిస్తోంది.

– ఎం.చాందిని, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, విజయనగరం

● గురుభక్తి

ఓ విద్యార్థి ఉన్నతంగా ఎదగడంలో గురువుపాత్ర అనిర్వచనీయమైనది. అలాంటి గురువులు ఎల్లప్పుడూ శిష్యులగుండెల్లో కొలువై ఉంటారు. దీనికి భామిని మండలం వడ్డంగి గ్రామంలో సోమవారం ఓ విద్యార్థి గురువును సత్కరించిన తీరే నిలువెత్తు నిదర్శనం. వడ్డంగికి చెందిన బోదెపు రాంప్రసాద్ విశాఖపట్నం ఆంధ్రాయూనివర్సిటీ హైస్కూల్‌లో (1985–90) మధ్య చదువు సాగించారు. అనంతరం ఉన్నత విద్యను అభ్యసించి అమెరికాలో స్థిరపడ్డారు. తన ఉన్నతికి పాఠశాల స్థాయిలో పునాదివేసిన హైస్కూల్ టీచర్ బేగమ్‌ను గ్రామానికి ఆహ్వానించారు. బ్యాండు మేళం, పూలవర్షం నడుమ గ్రామంలోని పాఠశాల వరకు తీసుకెళ్లారు. విద్యార్థుల సమక్షంలో ఆమెకు పాదపూజ చేసి, ఘనంగా సత్కరించారు. ఆమె బోధన తీరును కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్ద బోదెపు రఘుపతినాయుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- భామిని



బ్యాండ్ మేళంతో మేడమ్‌కు ఆహ్వానం



బ్యాండ్ మేళంతో మేడమ్‌కు ఆహ్వానం

కొట్లాట కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: కొట్లాట కేసు రుజువు కావడంతో ముద్దాయికి రెండేళ్ల జైలు, రూ.3వేల జరిమానా విధిస్తూ విజయనగం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య సోమవారం తీర్పు వెల్లడించినట్లు రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు పేర్కొన్నారు. బియ్యాలపేట గ్రామంలో ఉంటున్న ముద్దాడ రమణమ్మకు బావ ఆదినారాయణ కుటుంబానికి భూమి విషయమై తగాదాలున్నాయి. దీనిపై పలుమార్లు ఆదినారాయణ మద్యం తాగి రమణమ్మ కుటుంబాన్ని నానా దుర్భాషలాడేవాడు.

ఇదే విషయాన్ని ఆమెతో పాటు ఆమె భర్త సన్యాసి గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆగ్రహించిన ఆదినారాయణ 2022 ఏప్రిల్ 28న రాత్రి 7 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చి, సాముగరిడీ కత్తితో రమణమ్మ మీద దాడి చేసి, ఆమె ఎడమ చేతిపై తీవ్ర గాయం చేశాడు. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పటి రూరల్ ఎస్సై నసీమా బేగం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో ఆదినారాయణపై నేరారోపణలు రుజువు కావడంతో మెజిస్ట్రేట్ రమ్య పైవిధంగా తీర్పు వెల్లడించారని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజరాజేశ్వరి వాదనలు వినిపించారు.

భయం వీడితే భవిత మనదే

- బెంగళూరు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు



బొద్దాం హైస్కూల్ విద్యార్థులతో బెంగళూరుకు చెందిన ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

వేపాడ: చదువుతోనే ఉజ్వల భవిత సొంతమవుతుందని, విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని బెంగళూరు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు సూచించారు. ఆల్ ఇండియా టూర్ ప్రోగ్రాంలో భాగంగా అరకు వెళ్తూ.. మార్గంమధ్యలో ఉన్న బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. బాలికలతో కాసేపు ముచ్చటించారు. ఫ్యాషన్ ప్రపంచంలో ముందుండాలంటే భయం, సిగ్గు విడవాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని హితబోధ చేశారు. తల్లిదండ్రులను ఒప్పించి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. జీవితంలో ఎదగడానికి అవసరమైన సలహాలు, ఉన్నత విద్యాభ్యసనకు సన్నద్ధత, ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఫ్యాషన్ టెక్నాలజీ బాలికలను పాఠశాల హెచ్ఎమ్ బి.భాస్కరరావు అభినందించారు.

టిడ్కో కాలనీ పరిశీలన



టిడ్కో కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

పార్వతీపురం టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం పర్యటించారు. అడ్డాపుశీల గ్రామంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2018లో ప్రారంభించిన టిడ్కో గృహాలు 2020లో లబ్ధిదారులకు అందజేయాల్సి ఉండగా ఇప్పటికీ అప్పగించకపోవడం విచారకరమన్నారు. కొమరాడ మండలంలోని పూర్ణపాడు–లాబేసు వంతెన నిర్మాణం కూడా అసంపూర్తిగానే ఉందన్నారు. ఆమె వెంట బీజేపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.